సంప్రదాయ పండుగలను ఆదరించాలి

● కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్



వేడుకల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, కేరళవాసులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న సంప్రదాయ పండుగలను మరింతగా ఆదరిస్తూ భావితరాలకు అందించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లిలోని దేవినగర్‌లో కేరళ కాలనీకి చెందిన మలయాలి కుటుంబీకులు ఆదివారం నిర్వహించిన అట్టుకల్ పొంగల్ పండుగ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేరళ రాష్ట్ర సంప్రదాయ పండుగలను ఇక్కడ కూడా నిర్వహించడం అభినందనీయమని బండి రమేష్ అన్నారు. అనంతరం పోచమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఎం.కె.బాబు, నవోద్య, విజయ్‌కుమార్, మంగళన్, అప్పచెన్, మేఘ, రమేష్, సుదర్శన్, మేకల రమేష్, యుగంధర్, నరేందర్, చున్ను పాషా తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు వైద్యసేవలు

వివేకానందనగర్‌కాలనీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్యశిబారాల ఏర్పాటుతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ కమలాప్రసన్ననగర్‌కాలనీలో ఆదివారం హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు స్థానికులకు ఈసీజీ, బీపీ, షుగర్, గుండె, ఈఎన్‌టీ, దంత, గైనిక్ సంబంధిత పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ రంగారావు, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, సంజీవరెడ్డి, చంద్రకాంత్, చంద్రశేఖర్, తిరుపతి, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగడతాయని మాజీ కార్పొరేటర్ కేఎం.గౌరీష్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పద్మానగర్ ఫేజ్-2 సర్కిల్‌లో లైఫ్‌స్పాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిని ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు.

స్వచ్ఛ జలాలను భావితరాలకు అందించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జలవనరులు కలుషితం అవుతున్నాయని, స్వచ్ఛ జలాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సంత్ నిరంకారి మిషన్ ద్వారా బాబాహరదేవ్ సింగ్‌జీ మహారాజ్ ఉపదేశాల ఆదేశాల మేరకు ప్రాజెక్ట్‌అమృత్ పేరుతో స్వచ్ఛ నీరు, స్వచ్ఛ మనస్సు అనే కార్యక్రమాన్ని ఆదివారం కూకట్‌పల్లిలోని ఐడీఎల్ లేక్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నీటి పారిశుధ్య, స్వచ్ఛమైన మనస్సు దిశగా సేవలందిస్తున్న 200 మంది సేవాదళ్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మోహినీ బెహన్, రాకేష్‌పాల్, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్య, లక్ష్మీసాయి, మాధవి, రత్న పాల్గొన్నారు.



ఐడీఎల్ చెరువు వద్ద స్వచ్ఛ జల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

సీసీరోడ్డు పరిశీలన

హైదర్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ మసీద్ వద్ద పూర్తైన సీసీరోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టివేయాలని, బాగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, మల్లేశ్, నరసింహులు, నాగరాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.



యోగా తరగతులకు హాజరైన స్థానికులు, యోగా గురువులు

రోజూ యోగాతో ఆరోగ్యం

గచ్చిబౌలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆయుష కూడా పెంచుకోవచ్చని, జీవన విధానం మారుతుందని పతంజలి యోగా గురువు రాజేందర్ తివారి అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి గుల్‌మొహర్ పార్కులో జరిగిన పతంజలి యోగా ఉచిత తరగతులు 6వ వార్షికోత్సవం సందర్భంగా యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు నూనె సురేందర్, వెంకటేష్, కాలనీ ప్రధానకార్యదర్శి ఆనంద్‌కుమార్, నేతాజీకాలనీ అధ్యక్షుడు బేరి రాంచందర్‌యాదవ్, అసిస్టెంట్ యోగా గురువు ప్రియ, స్థానికులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలో అసోసియేషన్ ప్రతినిధులు

సందడిగా బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మియాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మియాపూర్ జనప్రియ అపార్టుమెంట్స్ సాయిబాబా దేవాలయంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. మియాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి వధూవరుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ వేదిక ద్వారా సుమారు 20కిపైగా వివాహాలు నిశ్చయమైనట్లు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి తెలిపారు. కార్యక్రమంలో వైష్ణవి ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు బెనారస్‌బాబు, గొల్లపూడి రాజేశ్వర్‌రావు, పీఆర్‌కే మూర్తి, సోమయాజులు, రాంబాబు, శంకర్‌శర్మ, రాఘవ, తిరుపతి శేషగిరి, విజయలక్ష్మి, రమాదేవి, భాగ్యలక్ష్మి, రత్నకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.

మరోసారి బీజేపీకే అవకాశం ఇవ్వాలి



కేపీహెచ్‌బీలో మాట్లాడుతున్న మురళీధర్ రావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశాన్ని 3వ స్థానంలో నిలిపేందుకు మరోసారి మోదీ నాయకత్వం దేశానికి అవసరమని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు అన్ని రాష్ట్రాల్లోని కుటుంబ పార్టీలు ఖాళీ అవబోతున్నాయన్నారు. తెలంగాణాలో 6 గ్యారంటీలు అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని, అవి చెల్లని గ్యారంటీలుగా మిగిలిపోయాయన్నారు. ఈ యాత్ర కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ దేవాలయం నుంచి బీజేపీ కార్యాలయం, కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్, రమ్యాగ్రౌండ్స్, నాలుగో ఫేజ్, కైతలాపూర్ మీదుగా మూసాపేట్‌లోని చిత్తారమ్మ టెంపుల్ వద్ద ముగిసింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, నాయకులు నాయినేని సూర్యప్రకాష్ రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్ మహేందర్, ప్రీతంరెడ్డి, పవన్ కుమార్, విజిత్, సూర్యారావు, శ్రీకర్ రావు పాల్గొన్నారు.

మెట్రోలో నగదు, నగలు చోరీ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెట్రోలో చోరీ జరిగింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ అభిదత్తా ఈనెల 13న ఎర్రమంజిల్ నుంచి అమీర్‌పేటకు మెట్రో రైలులో ప్రయాణించాడు. అమీర్‌పేటలో దిగి పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో పోలీసులకు అదేరోజు ఫిర్యాదు చేశాడు. పర్సులో రూ. 1,200, రూ. 50 వేల విలువగల గోల్డ్‌చైన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసును మధురానగర్ పీఎస్‌కు ఆదివారం బదిలీ చేశారు.

నానక్‌రాంగూడలో భారీ అగ్నిప్రమాదం

సకాలంలో అధికారులు స్పందించడంతో తప్పిన పెనుముప్పు



ఎగసిపడుతున్న మంటలు

రాయదుర్గం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన ఆదివారం రాత్రి 8గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సుమారు ఐదుమీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు, మాదాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే రోడ్డుపక్కన భూగర్భగ్యాస్‌పైపులైన్ పైన కొంతకాలంగా చుట్టుపక్కల ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులు చెత్త వేశారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆ చెత్తకు నిప్పంటించడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలను తెలుసుకుని అగ్నిప్రమాదానికి గల కారణాలపై విచారిస్తామని ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు తెలిపారు. సకాలంలో అధికారులు స్పందించడంతో పెనుముప్పు తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

హజ్ యాత్రకు 7,811 మంది ఎంపిక

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- తొలి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహణ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 7,811 మంది హాజీలు వెళ్లనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఈసారి 11,313 మంది దరఖాస్తు చేసుకున్నారని, హజ్ కమిటీ కోటాలో 7,811 మంది ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేటలో తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం నిర్వహించిన మొదటి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారి కోసం సౌదీ అరేబియాలోని మక్కాలో రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ద్వారా భోజనం, ఉండేందుకు వసతులు కల్పిస్తుందన్నారు. 7,811 మంది హాజీల్లో హైదరాబాద్‌కు చెందిన వారు 4వేల మందిపైగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుసెనీ తెలిపారు. మొదటి విడతగా రూ.80,800 చెల్లించాల్సి ఉండగా ఎంపికైన 1,316 మంది చెల్లించకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టామని, రెండో విడతగా రూ.1.70లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు వాయిదాలు కలిపి మార్చి 10న రాష్ట్ర హజ్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సౌదీ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక మూడో విడత చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో హజ్ యాత్రికునికి రూ.3.50లక్షల వరకు ఖర్చవుతుందని సూచనప్రాయంగా తెలిపారు. వచ్చే మే 9 నుంచి హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతారన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 20 అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, టీపీసీసీ కార్యదర్శి మక్సూద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

చందానగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చందానగర్ అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ వేడుకల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం లక్ష పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఛైర్మన్ యూవీ.రమణమూర్తి, సభ్యులు జైపాల్‌రెడ్డి. చంద్రశేఖర్, సుధాకర్, చిన్నారెడ్డి, కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

ప్రియాంక గాంధీ సభను విజయంతం చేయాలి

మియాపూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా ఈనెల 27న రెండు గ్యారంటీలు అమలు కార్యక్రమానికి ప్రియాంకగాంధీ రానుండడంతో ఆదివారం చేవెళ్లలో ఏర్పాటు చేస్తున్న సభను మంత్రి శ్రీధర్‌బాబు, జెడ్పీఛైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రియాంక గాంధీ సభ విజయవంతానికి పెద్దసంఖ్యలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమన్నారు.

మేయర్ బీఆర్ఎస్.. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్..!

(5వ పేజీ తరువాయి)

పాలనాపరంగానూ బీఆర్ఎస్ మేయర్‌కు అధికారుల సహకారం పూర్తిస్థాయిలో అందకుండా ప్రభుత్వపరంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల అధికారులు టార్గెట్‌గా పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. డిప్యూటీ మునిసిపల్, జోనల్ కమిషనర్ల వైఖరిని ప్రస్తావిస్తూ పరోక్షంగా కమిషనర్ తీరునూ ఎండగట్టారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ తరఫున కార్పొరేటర్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ తోడయ్యారు. దీంతో సంస్థలో మరో అధికార కేంద్రం మొదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇంతకుముందు నామ్ కే వాస్తే అన్నట్టుగా ఉన్న శ్రీలతారెడ్డి.. అధికార పార్టీలో చేరిన దృష్ట్యా.. ఇక సమీక్షలు, సమావేశాలు నిర్వహించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అవిశ్వాసం పెట్టలేరు..

2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 56 స్థానాల్లో గెలిచింది. బీజేపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్పొరేటర్ ఒకరు గులాబీ పార్టీలో చేరారు. అయినా, ప్రస్తుతం కౌన్సిల్‌లో ఆ పార్టీ బలం 52కు తగ్గింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరడమే ఇందుకు కారణం. కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. గులాబీ పార్టీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లూ త్వరలో అధికార పార్టీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే మరో ఏడాది తర్వాత బీఆర్ఎస్ బలం ఎంతుంటుందన్నది చెప్పలేని పరిస్థితి. బీజేపీ సభ్యుల సంఖ్య 40, ఎంఐఎం సభ్యుల సంఖ్య 42గా ఉంది. బీజేపీకి చెందిన ఓ కార్పొరేటర్ మరణించగా.. ఎంఐఎం నుంచి ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో పురపాలక శాఖ చట్టం ప్రకారం మూడేళ్ల అనంతరం అవిశ్వాసం పెట్టే అవకాశముంది. గతంలో దీనిని నాలుగేళ్లకు సవరిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ప్రతిపాదన పంపింది. ఆమె ఫైల్‌ను వెనక్కి పంపడంతో చట్ట సవరణ జరగలేదు. గతంలో గవర్నర్ ఆమోదించిన పక్షంలో ప్రస్తుతం మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో అవిశ్వాసానికి అవకాశం ఉండేది కాదు.

జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుత బలాబలాలు

పార్టీ	సభ్యులు
బీఆర్ఎస్	52
ఎంఐఎం	42
బీజేపీ	40
కాంగ్రెస్	12
మొత్తం	147

(ఖాళీగా మూడు స్థానాలు)



కూకట్‌పల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ)గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్
- హైదర్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి)

మేడ్చల్ మెట్రోను ఫేజ్-2లో చేర్చాలి



నిరసన తెలుపుతున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మేడ్చల్‌కు మెట్రోను ఫేజ్-2లో చేర్చాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సుచిత్ర జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతుగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి, మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ ఫేజ్-2లో మేడ్చల్‌ను చేర్చకుంటే ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, గచ్చిబౌలికి, ఉప్పల్, ఎల్‌బీనగర్‌కి, శంషాబాద్‌కు మెట్రో వస్తుంది కానీ, ఉత్తరాన ఉన్న మేడ్చల్ ప్రాంతానికి మెట్రో లేక పోవడం చాలా బాధాకరం అన్నారు. మేడ్చల్ ప్రాంతానికి మెట్రోను ప్రభుత్వం ఇవ్వాలని మూడు నెలల నుంచి మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, జార్జ్, ఉదయ్ గుప్త, రాజారెడ్డి, అరవిందరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న అబాకస్, వేదిక్ మ్యాథ్స్ విజేతలు

అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు విశేష స్పందన

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విశ్వం ఎడ్యుటెక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లిలోని పీఎస్ఎం హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 400 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమానికి తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) సలహాదారుడు యాదగిరిశేఖర్ రావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో మేధోశక్తిని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విశ్వం సంస్థ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న రాజీవ్ గృహకల్ప వాసులు

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

నిజాంపేట్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తున్నందున ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని రాజీవ్‌గృహకల్ప వాసులు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మహిళలు, రాజీవ్‌గృహకల్ప వాసులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

బాలానగర్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కొన్నిరోజుల క్రితం బాలానగర్ కోఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్(సీఐఈ) ఫేస్-2 గాంధీనగర్‌లో కూల్చి వేసిన ఓవర్ ట్యాంక్ కూల్చివేతపై సీబిటీ వైస్‌చైర్మన్ భరత్‌వీర్ ఆదివారం బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐఈకి చెందిన ఈ స్థలంలో ఉన్న ట్యాంక్‌ను బోర్డుమీటింగ్‌లో చర్చించి ఎలాంటి అప్రూవల్ తీసుకోకుండానే కూల్చివేశారన్నారు. ట్యాంక్‌ను కూల్చివేయగా వచ్చిన సుమారు రూ.లక్షల విలువ చేస్తే స్టీలును కాజేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కూల్చివేతకు పాల్పడిన ముగ్గురిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. భరత్‌వీర్ వెంట సీఐఈ డైరెక్టర్ మురళి, ఆర్టీఐ యాక్టివిటిస్ట్ కుప్పు స్వామి ఉన్నారు.



హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీనగర్, అంబేడ్కర్‌నగర్ వాసుల సమస్యలు పరిష్కరిస్తాం : హన్మంత్‌రెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): భౌరంపేట్ లక్ష్మీనగర్, అంబేద్కర్ నగర్ వాసుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సీపీఐ నాయకులు ఏసురత్నం ఆధ్వర్యంలో పేదప్రజలు హన్మంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను తెలిపారు. గతంలో మీరు ఎంపీపీగా ఉన్న సమయంలో సర్వేనెంబర్ 578,580లలో పేదలకు స్థలాలు ఇచ్చారని, వాటిలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హన్మంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.యాదయ్య, కె.మల్లేశం, భిక్షపతి, నదీమ్‌పాషా, శ్రీను, బాస్కర్, సత్యనారాయణ, బాగారెడ్డి, అచ్చిరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.